"నీ శరీరమే నువ్వు అని అనుకుంటున్నావు కాబట్టి నీకు కోపం వస్తుంది. నేను, ఈ శరీరం వేరు అని నేను అనుకోవడం వల్ల నాకు కోపం రాదు. ఈ చేతిలోని కమండలాన్ని తిడితే ఎంతో ఈ శరీరాన్ని తిట్టినా అంతే నాకు." జవాబు చెప్పి వెళ్ళిపోయాడతను.

## 113. సంపద పెరిగే మార్గం

ఓ గ్రామంలోని ఓ రైతు తన ఇంటి పెరడులో ఓ అరటి చెట్టు పిలకని తెచ్చి వేసి పెంచసాగాడు. దానికో గెల కాసింది. ఓ రోజు అతను పొలం నించి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆ అరటి గెల ఇంట్లో కనిపించింది. ఆ రైతు దానివంక తేరిపార చూసి భార్యని అడిగాడు.

"వీటిని ఏం చెయ్యదలచుకున్నావు?"

"కొంత కూరకి వాడతాను. పాడయిపోతాయి కాబట్టి మిగిలిన వాటిలోంచి కొన్ని చిప్స్ చేసి దాస్తే ఆకలేసినప్పుడు మనం తినచ్చు. ఇంకా మిగిలినవి కూరల బండి వాడికి ఇచ్చి వేరే కూరలు తీసుకుంటాను."

"ఆ కొడవలి ఇటివ్వు."

దాన్ని అందకుని ఆ రైతు సగం గెలని తెంపి ఆ వీధిలోని వాళ్ళందరికీ పంచి వచ్చి భార్యతో చెప్పాడు.

"ఒకటి గుర్తుంచుకో. మనకున్నది ఇతరులతో పంచుకోక పోతే భౌతిక సంపద పెరగచ్చు. కాని అందువల్ల ఆధ్యాత్మిక సంపదని కోల్పోతాం."

## 114. ఎప్పుడు?

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారిలో చాలామందిలో కలిగే నమ్మకం, తమకి ఆత్మ సాక్షాత్కారం కలగడం జరిగిపోయిందన్నది. ఆశాపూరితమైన ఆలోచనల వల్ల కొందరు ఇలాంటి భ్రాంతికి లోనవుతూంటారు. అలాంటివారిలో ఒకరు తన గురువు దగ్గర దీక్ష తీసుకున్నాక కొంత కాలం